



# రాయల్ జర్నలిజం

ద్విభాషా దినపత్రిక

ROYAL JOURNALISM

RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 169 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | గురువారం 11 జూలై 2024 | పేజీలు : 8 వెల :రూ 2-00

GUNTUR | VOL-01 | ISSUE - 169 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 11 THUSDAY JUNE 2024 | PAGES : 8 | Rs :2-00


## పోలవరం ప్రాజెక్టుకు బారీగా వరద




పోలవరం : ఏపీ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టులోకి వరద ఉధృతి పెరుగుతోంది. గోదావరిలో వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు వద్దకు భారీగా నీరు వచ్చి చేరుతోంది.స్పిల్ వేపైకి భారీగా నీరు వస్తుండటంతో గేట్లు తెరిచి కిందకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ సుందర దృశ్యాలు కనిపిస్తున్నాయి. రాష్టంలో తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.తెలంగాణతో పాటు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. దీంతో ఎగువ నుంచి వస్తున్న వరదతో పోలవరం ప్రాజెక్టు వద్ద జలకళ సంతరించుకుంది. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టులో 48 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 26.700 మీటర్లు, స్పిల్‌వే దిగువన 16.720 మీటర్లు, కాపర్ డ్యామ్ కు ఎగువన 26.800 మీటర్లు, కాపర్ డ్యాంకి దిగువన 15.690 మీటర్లు నీటిమట్టం కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా 6.018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు జలవ నరుల శాఖ అధికారులు చెప్తున్నారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 14. 802 మీటర్లకు చేరుకోవడంతో, 17 పంపులు 17 మోటార్లతో నీటిని విడుదల చేసినట్లు వారు తెలిపారు. ఈ నెలలో ఇప్పటి వరకూ 2.4060 టీఎంసీల నీటిని విడుదల చేశారు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముంది.

## జగన్ హయాంలో నీటి పారుదల శాఖ 20 ఏళ్లు వెనక్కి: మంత్రి నిమ్మల



ఉండవల్లి: వ్యవసాయం, రైతులను కాపాడుకోవడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుధవారం ఆయన ప్రకాశం బ్యారేజ్ నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు సాగు, తాగునీటిని విడుదల చేశారు.గుంటూరు జిల్లా ఉండవల్లి వద్ద డెల్టా ప్రధాన రెగ్యులేటర్ వద్ద కృష్ణమ్మకు పూజలు చేశారు. అనంతరం రెగ్యులేటర్ గేట్లు తెరిచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. జగన్ హయాంలో ఇరిగేషన్ శాఖ 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని విమర్శించారు. పట్టిసీమను వట్టిసీమన్న జగన్.. రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో సాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఒకే రోజు 4 ఎత్తిపోతల పథకాలు ప్రారంభించామన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీటిని విడుదల చేసినట్లు వివరించారు.చింతలపూడి ప్రాజెక్టును వైకాపా నాయకులు నిర్లక్ష్యం చేశారని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. ఐదేళ్లు పూడిక తీయకపోవడంతో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంతో పులిచింతల ఎండిపోయిందని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. 40 టీఎంసీలు ఉండాల్సిన చోట అర టీఎంసీ కూడా నీటి నిల్వ లేదని చెప్పారు. చివరి ఎకరాకు నీళ్లిచ్చే వరకు తమ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వివరించారు.

## ప్రొబేషనరీ ఐఏఎస్ గొంతెమ్మ కోర్కెలు.. కన్నెర్ర చేసిన ప్రభుత్వం




పుణె: అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడంతో ఒక ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారి బదిలీ అయ్యారు. ప్రత్యేక వసతులు అందించాలని ఆమె డిమాండ్ చేయడంతో వివాదాల్లో చిక్కుకున్నారు.దాంతో ఆమెపై మహారాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణెలో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి డాక్టర్ పూజా ఖేద్కర్ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండానే తన ప్రైవేట్ ఆడి కారుకు రెడ్-బ్లూ బీకన్ లైట్లు, వీఐపీ నంబర్ ప్లేట్ ఏర్పాటుచేసుకున్నారు. అంతేకాక కారుకు మహారాష్ట్ర ప్రభుత్వం అనే స్టిక్కర్ సైతం అమర్చారు. వీటితోపాటు తనకు వసతి సౌకర్యాలు కల్పించాలని, తగినంత సిబ్బంది, కానిస్టేబుల్‌తో ఓ అధికారిక ఛాంబర్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.అంతటితో ఆగకుండా అదనపు కలెక్టర్ అజయ్ మోర్ లేని సమయంలో ముందస్తు అనుమతి తీసుకోకుండా ఆయన ఛాంబర్‌లో తన నేమ్‌ప్లేట్ పెట్టుకొని దాన్ని తన ఛాంబర్‌గా వినియోగించుకొన్నారు. అక్కడ ఉన్న కుర్చీలు, సోఫాలు, టేబుల్‌లతో సహా అన్ని మెటీరియల్‌లను కూడా తొలగించారు. తన పేరు మీద లెటర్ హెడ్, విజిటింగ్ కార్డ్, పేపర్ వెయిట్, నేమ్‌ప్లేట్, రాజముద్ర, ఇంటర్‌కామ్ అందించాలని రెవెన్యూ అసిస్టెంట్‌ను ఆదేశించారు. రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అయిన పూజా ఖేద్కర్ తండ్రి కూడా తన కుమార్తె డిమాండ్‌లను నెరవేర్చాలని కలెక్టర్ కార్యాలయ అధికారులను ఒత్తిడి చేశారు. లేదంటే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అయితే ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రొబేషన్‌లో ఉన్న ట్రైనీ ఐఏఎస్ అధికారులకు వీఐపీ ట్రీట్‌మెంట్, పైన పేర్కొన్న అదనపు సౌకర్యాలేవీ ఉండవు. ఐఏఎస్‌లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలంటే వారు గెజిటెడ్ అధికారులై ఉండాలి. ఈ విషయాన్ని పుణె కలెక్టర్ డాక్టర్ సుహాస్ దివాసే చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లడంతో పూజా ఖేద్కర్‌ను పుణె నుంచి వాషిమ్‌కు బదిలీ చేశారు. ఆమె తన ప్రొబేషన్ కాలం పూర్తయ్యే వరకు వాషిమ్ జిల్లాలో సూపర్ న్యూమరరీ అసిస్టెంట్ కలెక్టర్‌గా వ్యవహరిసారని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. 2023 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ UPSCలో 841 ర్యాంక్ సాధించారు. కాగా ఈ ఘటనపై ఆర్‌టీఐ కార్యకర్త స్పందిస్తూ పలు సందేహాలు లేవనెత్తారు. "పూజా ఖేద్కర్ ఓబీసీ నాన్ క్రిమిలేయర్ కోటాలో ఐఏఎస్ అధికారిగా సెలక్ట్ అయ్యారు. ఆమె తండ్రికి రూ.40 కోట్ల ఆస్తులు ఉన్నాయి. రూ.కోట్లలో ఆస్తులు ఉన్నవారు నాన్-క్రిమిలేయర్ కిందకు ఎలా వస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. ఆమెకు పలు మానసిక సమస్యలు ఉన్నాయని, ఉద్యోగంలో చేరే సమయంలో మెడికల్ టెస్ట్‌లకు కూడా హాజరుకాలేదని ఆరోపించారు. ఇవన్నీ దాటుకొని ఆమె ఎలా ఐఏఎస్ అధికారి అయ్యారనేది ఓ ప్రశ్నగా మిగిలి పోయిందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## ఏపీ సీఎం చంద్రబాబుతో బీపీసీఎల్ ఛైర్మన్ భేటీ



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు తో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) ప్రతినిధులు భేటీ అయ్యారు. బీపీసీఎల్ ఛైర్మన్, ఎండీ కృష్ణకుమార్, సంస్థ ప్రతినిధులు ఆయన్ను కలిశారు.రాష్ట్రంలో పెట్రోల్ రిఫైనరీ పరిశ్రమ ఏర్పాటుపై సీఎంతో చర్చించారు. సుమారు రూ.60 వేల కోట్లతో రిఫైనరీ ఏర్పాటు అంశంపై ప్రభుత్వం, బీపీసీఎల్ మధ్య సంప్రదింపులు జరిగినట్లు సమాచారం.ఇటీవల దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురితో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. మచిలీపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుచేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బీపీసీఎల్ ప్రతినిధులు సీఎంను కలిశారు.

### ఆర్థికశాఖ శ్వేతపత్రంపై సీఎం సమీక్ష


ఆర్థికశాఖపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. త్వరలో శ్వేతపత్రం విడుదల చేయనున్న నేపథ్యంలో రాష్ట్రానికి ఉన్న అప్పులు, ఆదాయాలపై అధికారులను ఆరా తీశారు. ఇప్పటికే అన్ని రకాల అప్పులు కలిపి మొత్తం రూ.14లక్షల కోట్ల వరకు ఉన్నాయని ఆర్థికశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పెండింగ్ బిల్లులు ఎంత ఉన్నాయనే అంశంపైనా సీఎం చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై శాఖల వారీగా వివరాలు కోరినట్లు అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి బడ్జెట్ కాకుండా ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ పెట్టాలని ఆర్థిక శాఖ ఈ సందర్భంగా ప్రతిపాదించింది.

## పీసీబీ దస్త్రాల దహనం కేసు.. దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు



విజయవాడ: పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(పీసీబీ) ఫైల్స్ దహనం కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. పెనమలూరు సీఐ రామారావు ఆధ్వర్యంలో పోలీసు బృందం బుధవారం విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో విచారణ చేపట్టింది.కార్యాలయం నుంచి దస్త్రాలు బయటకు వెళ్లడంపై పీసీబీలోని ఏడు విభాగాల్లోని అధికారులను ప్రశ్నించారు. ఫైల్స్, హార్డ్ డిస్క్‌లు బయటకు వెళ్లటంలో అధికారుల పాత్ర, కాల్చిన దస్త్రాల్లోని అంశాలు, వాటి ప్రాధాన్యతపై ఆరా తీశారు. దస్త్రాల్లోని సమాచారంపై సిబ్బంది వాంగ్మూలాలు నమోదు చేశారు.ఇటీవల కృష్ణా కరకట్టపై దస్త్రాల దహనం ఘటనకు సంబంధించి పెనమలూరు పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్‌ఎస్‌ఎస్)లోని సెక్షన్ 106 కింద కేసు నమోదు చేశారు. సమీర్ శర్మ వద్ద ఓఎస్డీగా పనిచేసిన రామారావు, డ్రైవర్ నాగరాజు, అటెండర్ రూపేంద్రలను స్టేషన్‌కు పిలిపించి సుదీర్ఘంగా విచారించారు. దస్త్రాల్ని తీసుకొచ్చిన వాహనాన్ని ఇప్పటికే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దస్త్రాల దహనంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. కారకులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. 'పీసీబీలో దస్త్రాలు, రికార్డులు, వాటి నిర్వహణ, భద్రపరిచేందుకు అనుసరిస్తున్న విధివిధానాలపై వెంటనే నివేదిక ఇవ్వండి. జోనల్, రీజనల్ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణపై దృష్టిపెట్టండి. వాటి భద్రతపై తనిఖీ చేయండి' అని ఇప్పటికే అధికారులను ఆదేశించారు.

## భారత్-రష్యా సంబంధాలపై.. అమెరికా ఏమన్నదంటే!



వాషింగ్టన్: రష్యాతో భారత్ సన్నిహిత సంబంధాలు కొనసాగించడంపై ఆందోళనలు ఉన్నప్పటికీ.. భారత్‌తో తమ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుందని అగ్రరాజ్యం స్పష్టం చేసింది.ఆ రెండు దేశాల మధ్య సంబంధాలు ఎంతోకాలంగా ఉన్నవేనని గుర్తుచేసింది. ఉక్రెయిన్ సంక్షోభం వేళ ప్రధాని నరేంద్రమోదీ మాస్కో పర్యటనను పాశ్చాత్యదేశాలు ఆసక్తిగా గమనించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ శాఖ, రక్షణ శాఖలు స్పందించాయి."భారత్, రష్యాల మధ్య చాలాకాలంగా ద్వైపాక్షికసంబంధాలు ఉన్నాయి. అమెరికా కోణంలో చూస్తే.. భారత్ వ్యూహాత్మక భాగస్వామే. రష్యాతో వారి సంబంధాలపై మాకు పూర్తి స్పష్టత ఉంది. ఈ వారం నాటో శిఖరాగ్ర సదస్సు జరగనున్న వేళ.. మోదీ పర్యటన చేయడంపై యావత్ ప్రపంచం దృష్టి పెట్టింది" అని పెంటగాన్ ప్రెస్ సెక్రటరీ మేజర్ జనరల్ ప్యాట్ రైడర్ పేర్కొన్నారు.ప్రపంచ దేశాలతో తాము దూరం కాలేదని ఈ పర్యటన ద్వారా పుతిన్ ప్రకటించుకున్నా అందులో ఆశ్చర్యం లేదని ప్యాట్ రైడర్ అభిప్రాయపడ్డారు. యుద్ధానికి వెళ్లాలనే నిర్ణయమే రష్యాను ప్రపంచానికి దూరం చేసిందన్న ఆయన.. దానివల్ల రష్యా ఎంతో మూల్యం చెల్లిస్తోందన్నారు. ఉక్రెయిన్ సంక్షోభానికి సంబంధించి కేవలం రష్యాతోనే కాకుండా జెలెన్‌స్కీతోనూ ఇటీవల మోదీ మాట్లాడారని, శాంతియుత పరిష్కారానికి భారత్ మద్దతు ఇస్తుందనే భరోసా కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. రష్యాతో భారత్ సంబంధాలపై ఆందోళనలు ఉన్నప్పటికీ వాటిపై తమకు స్పష్టత ఉందని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ పేర్కొన్నారు. ఆ రెండు దేశాల మైత్రి కొనసాగింపుపై తమ ఆందోళనలను భారత్ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని అన్నారు. రష్యాతో భారత్‌కు ప్రత్యేకమైన, వ్యూహాత్మకమైన భాగస్వామ్యం ఉన్న విషయం తెలిసిందే.


## ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలం..

### మంత్రి లోకేశ్ ఆగ్రహం



అమరావతి: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో గంజాయి కలకలంపై మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ట్రిపుల్ ఐటీలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఆయన్ను కలిశారు.తమ పిల్లల్ని అక్కడ చేర్పించి నష్టపోతున్నామంటూ వాపోయారు. క్యాంపస్ మొత్తం గంజాయికి అడ్డాగా మారిందని ఫిర్యాదు చేశారు.దీనిపై స్పందించిన లోకేశ్.. సమస్యను పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్తు కాపాడతానని హామీ ఇచ్చారు. గంజాయిని ప్రోత్సహించే స్థానిక రాజకీయ నాయకులపైనా కఠిన చర్యలకు ఆదేశించారు. విద్యాలయాల్లో వాటి ఆనవాళ్లు లేకుండా నిర్మూలిస్తామని తల్లిదండ్రులకు ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికే ప్రభుత్వం ఆ దిశగా కఠిన చర్యలు చేపట్టిందని లోకేశ్ వివరించారు. మరోవైపు క్యాంపస్‌లో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు మార్కుల పరంగా ఫెయిల్ అవుతున్నారని తల్లిదండ్రులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పదో తరగతిలో తమ పిల్లలు 90 శాతం పైగా మార్కులు సాధించారని.. కానీ ఇంటర్‌లో సిబ్బంది ఇంటర్నల్ మార్కుల విషయంలో ఉద్దేశపూర్వకంగా ఫెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. సమస్యను తప్పక పరిష్కరించి విద్యార్థుల భవిష్యత్తు కాపాడతానని లోకేశ్ హామీ ఇచ్చారు.

## త్వరలోనే ఆలయాలకు కొత్త పాలకమండళ్లు: మంత్రి ఆనం



అమరావతి: రాష్ట్రంలోని ఎనిమిది ప్రధాన దేవాలయాల్లో సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలపై సమీక్ష చేస్తున్నట్లు ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు.విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న అమ్మవారిని కుటుంబసమేతంగా ఆయన దర్శించుకున్నారు. ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులపై అధికారులు మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. త్వరలోనే అన్ని ఆలయాలకు కొత్త పాలకమండళు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు."ప్రభుత్వం మారిన తర్వాత అప్పటి వరకు కొనసాగిన పాలకమండళ్ల సభ్యులు తమ పదవీకాలంతో సంబంధం లేకుండా రాజీనామాలు చేయడం నైతిక విలువలు పాటించడం అవుతుంది.

## మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై 18న తీర్పు

గుంటూరు: మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్లపై ఈనెల 18న తీర్పు వెలువడనుంది. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రం వద్ద తెదేపా ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై దాడి, కారంపూడి సీఐ నారాయణ స్వామిపై దాడి కేసుల్లో పిన్నెల్లి అరెస్టయ్యారు.ప్రస్తుతం నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ రెండు కేసుల్లో బెయిల్ ఇవ్వాలని పిన్నెల్లి మాచర్ల కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. న్యాయస్థానం బెయిల్ నిరాకరించింది.దీంతో ఆయన గుంటూరు 4వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణకు రాగా.. పిన్నెల్లి తరఫున న్యాయవాదులు బెయిల్ కోసం వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశ్విని కుమార్ వాదనలు వినిపిస్తూ బెయిల్ ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. పిన్నెల్లి నేర చరిత్ర.. ఈ కేసులో మరికొంత మందిని అరెస్టు చేయాల్సి ఉన్నందున బెయిల్ ఇవ్వొద్దని కోరారు.పిన్నెల్లి కొద్ది రోజులు పరారుకావటంపైనా కోర్టులో వాదనలు జరిగాయి.


## అందరు కలిసికట్టుగా పనిచేసి జిల్లా అభివృద్ధి సాధించాలి

....2వ పేజీలో)

# విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు భరణం ఇవ్వడంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ : విడాకులు తీసుకున్న ముస్లిం మహిళ తన భర్త నుంచి భరణం కోరుతూ సుప్రీంకోర్టు ఈరోజు కీలక తీర్పు వెలువరించింది. CrPC సెక్షన్ 125 ప్రకారం.ముస్లిం మహిళ తన భర్త నుండి భరణం క్లెయిమ్ చేసుకోవచ్చని కోర్టు మళ్లీ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ముస్లిం మహిళలకు అనుకూలంగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం ముస్లిం మహిళలు తమ భర్తల నుంచి భరణం కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని కోర్టు పేర్కొంది.తన భార్యకు భరణం ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఓ ముస్లిం వ్యక్తి సుప్రీంకోర్టులో సవాలు చేశాడు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా కోర్టు కీలక తీర్పును వెలువరించింది. మహ్మద్ అబ్దుల్ సమద్ అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు.సీఆర్‌పీసీ సెక్షన్ 125 ప్రకారం విడాకులు తీసుకున్న భార్యకు భరణం చెల్లించాలన్న ఆదేశాలను వ్యతిరేకిస్తూ మహ్మద్ అబ్దుల్ సమద్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు బీవీ నాగరత్న, అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది.ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం 1986 సెక్యులర్ చట్టాన్ని అధిగమించలేదని కోర్టు పేర్కొంది. జస్టిస్ నాగరత్న, జస్టిస్ మసీహ్ విడివిడిగా, కానీ ఏకగ్రీవ తీర్పులను వెలువరించారు. 10,000 భరణం ఇవ్వాలని మహ్మద్ సమద్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.సెక్షన్ 125 మహిళలందరికీ వర్తిస్తుంది: భరణం అవసరమయ్యే చట్టం వారి మతంతో సంబంధం లేకుండా వివాహిత మహిళలందరికీ వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గృహిణి భార్య మానసికంగా, ఇతరత్రా ఆధారపడుతుందనే వాస్తవాన్ని కొంతమంది భర్తలు గుర్తించరు. భారతీయుడు గృహిణి పాత్రను గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

# మిస్ కాదు ఇక నుంచి మిస్టర్.. ట్రాన్స్ జెండర్‌గా మారిన సివిల్స్ అధికారి..



హైదరాబాద్ : హైదరాబాద్ కు చెందిన ఒక సివిల్ సర్వీస్ అధికారి తన పేరును ఎం అనసూయ బదులు ఎం అనుకతిర్ సూర్యగా మార్చుకున్నారు. తాను ఆడ లింగం నుంచి పురుష లింగంలోనికి మారాలని భావించారు.ఆదే క్రమంలో ఉద్యోగం సాధించినప్పుడు అనసూయగా ఉన్న పేరును ప్రస్తుతం ట్రాన్స్ జెండర్ గా రూపాంతరం చెందిన తరువాత అనుకతిర్ సూర్యాగా మార్చాలని కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థనను ఉంచారు. స్త్రీ నుంచి పురుషునిగా మారిన అతని అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ లోని కస్టమ్స్ ఎక్సైజ్ తో పాటూ సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యూనల్ ఆఫీసులో జాయింట్ కమిషనర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. దేశ చరిత్రలోనే ఇది తొలిసారిగా కొత్త చరిత్రను సృష్టించారు ఈ సివిల్ సర్వీస్ అధికారి. ఇప్పటి వరకూ ఎవరూ చూడని, వినని సరికొత్త ట్రెండ్ కు శ్రీకారం చుట్టారు. ఆయన ఆయన అభ్యర్థనను కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదిస్తూ కీలక ఉత్తర్వులు వెలువరించింది.కేంద్రం ఆదేశాలు జారీ చేయడంతో ఆమె పేరు ముందు ఉన్న మిస్ కాస్త మిస్టర్ గా మారనుంది. ప్రతి సర్టిఫికేట్లో కూడా మిస్ బదులు మిస్టర్ గా మార్చుకోవాల్సి ఉంటుంది. తమిళనాడుకు చెందిన ఈ ఐఆర్ఎస్ అధికారి అనుకతిర్ సూర్య చెన్నైలోనే బాల్యం విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఇక గ్యాడ్యుయేట్ విద్యను మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ లో గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. అలాగే 2023 సంవత్సరంలో భోపాల్ లోని నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్సిటీ నుంచి సైబర్ లా అండ్ సైబర్ ఫోరెన్సిక్స్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేశారు. ఆ తరువాత సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సి అండ్ ఐటిలో తొలిసారి తన వృత్తిలోకి అడుగు పెట్టారు. కెరియర్ ప్రారంభంలో అసిస్టెంట్ కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరిచారు. ఆ తరువాత 2018లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. 2023లో అనుకతిర్ హైదరాబాద్‌లోని CESTAT (కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్)లో పదవీ బాధ్యతలు స్వీకరించి ప్రస్తుతానికి అందులోనే కొనసాగుతున్నారు.

# ఆ బ్యాంకు వినియోగదారులకు భారీ షాక్.. లోన్ల రేట్లు భారీగా పెంపు..




అమరావతి :అతి పెద్ద ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన కస్టమర్లకు షాక్ ఇచ్చింది. తమ వద్ద లోన్లు తీసుకున్న వారికి అదనపు భారాన్ని మోపుతూ సంచలన నిర్ణయాన్ని ప్రకటించింది.సాధారణంగా బ్యాంకులు రుణాల వడ్డీ రేట్లను ఎప్పటికప్పుడు రివ్యూ చేయడం జరుగుతుంది. దీనిని మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు(ఎంసీఎల్ఆర్) అని అంటారు. ఈ రేటును పది బేసిస్ పాయింట్లను జూలై ఎనిమిదో తేదీ నుంచి పెంచుతున్నట్లు బ్యాంకు ప్రకటించింది. ఈమేరకు తన అధికారిక వెబ్‌సైట్లో హెచ్‌డీఎఫ్‌సీ పేర్కొంది. ఈ తాజా పెంపుతో ఎంసీఎల్ఆర్ రేటు 9.05శాతం నుంచి 9.40శాతం మధ్య ఉంటుంది. ఫలితంగా కొన్ని రకాల రుణాలపై వడ్డీ రేట్లు పెరిగాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హోమ్ లోన్, పర్సనల్ లోన్, వెహికల్ లోన్ సహా అన్ని ఫ్లోటింగ్ రేటు కలిగిన లోన్లపై వడ్డీ రేటు పెరగనుంది. అంటే ఈఎంఐ భారం ఎక్కువవుతుంది. ఇప్పటికే తీసుకున్న వారందరిపైనా ఇది ప్రభావం చూపుతుంది. వారందరూ ఇకపై ఎక్కువ ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది.

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాజా రేట్లు ఇవి..**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాజాగా ఓవర్ నైట్ టెన్యూర్ ఎంసీఎల్ఆర్ రేటును 10 బేసిస్ పాయింట్లను పెంచి8.95 నుంచి 9.05శాతానికి చేర్చింది.నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటు 9శాతం నుంచి 9.10శాతానికి పెంచింది.మూడు నెలల కాల వ్యవధి గల ఎంసీఎల్ఆర్ రేటు 9.15శాతం నుంచి 9.20శాతానికి పెరిగింది.ఆరు నెలల కాల వ్యవధికి ఎంసీఎల్ఆర్ రేటు 9.30శాతం నుంచి 9.40శాతానికి చేరింది.రెండేళ్లు, మూడేళ్ల వ్యవధికి ఎంసీఎల్ఆర్‌రేటు 9.40శాతంగా ఉంది.

**అసలు ఎంసీఎల్ఆర్ అంటే..**

ఎంసీఎల్ఆర్ పూర్తి పేరు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్. అంటే బ్యాకులు వివిధ లోన్లపై వసూలు చేసే కనీస వడ్డీ. దీనిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉంటారు. అన్ని బ్యాంకుల్లో ఇదే పద్ధతిని అమలు చేసేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలున్నాయి. వినియోగదారులు తీసుకునే లోన్ల వడ్డీలు ఏడాది వ్యవధితో ఉండే ఎంసీఎల్ఆర్ రేటు ఆధారంగా ఉంటాయి. ఏడాది ఎంసీఎల్ఆర్ పెరిగితే లోన్ తీసుకున్న కస్టమర్లు ఎక్కువ ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. లేదా లోన్ టెన్యూర్ పెరిగిపోతుంది. ఇది వినియోగదారుడిపై అదనపు భారాన్ని మోపుతుంది. ఇప్పుడు హెచ్‌డీఎఫ్‌సీ కూడా ఈ ఎంసీఎల్ఆర్ పది బేసిస్ పాయింట్లను పెంచడంతో ఇప్పటికే లోన్లు తీసుకున్న వినియోగదారులు ఈ అదనపు భారాన్ని భరించాల్సిందే. అది కూడా ఫ్లోటింగ్ వడ్డీ రేటుపై లోన్లు తీసుకున్న వినియోగదారులకు ఇది వర్తిస్తుంది.

# సోమనాథ్ ఆలయం ఒక పెద్ద మిస్టరీ.. ఈ జ్యోతిర్లింగం గురించి మీకు ఈ విషయాలు తెలుసా..?



అమరావతి : దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో సోమనాథ్ ఆలయం ముఖ్యమైనది. ఇది గుజరాత్ రాష్ట్రంలోని పశ్చిమ తీరంలో ఉంటుంది. దేశంలోని 12 జ్యోతిర్లింగాల్లో సోమనాథ్ ఆలయం ఒకటి.ఏడాది పొడవునా శివ భక్తులు, టూరిస్టులు ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తుంటారు. అద్భుతమైన శిల్ప సంపదకు ఇది నిలయం. అయితే గొప్ప చరిత్ర ఉన్న ఈ గుడి కొన్ని మిస్టరీలతో అందరినీ ఆకర్షిస్తోంది. సోమనాథ్ ఆలయం గురించి చాలా మందికి తెలియని కొన్ని ఇంట్రెస్టింగ్ ఫ్యాక్ట్స్ తెలుసుకుందాం.

**ఆలయ నిర్మాణం :** చాళుక్య రాజు మహారాజా మూలరాజు 9వ శతాబ్దం (997 %జఙు%) కాలంలో సోమనాథ్ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అయితే ఈ విషయానికి సంబంధించి కచ్చితమైన చారిత్రక ఆధారం ఏదీ ఇప్పటి వరకు లభించలేదు. సోమనాథ్ ఆలయం ఎప్పుడు నిర్మించారనే అంశంపై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. గతంలోనే నిర్మించిన గుడిని మూలరాజు మరింత అభివృద్ధి చేశారని, ఆలయ పరిమాణం, కొలతలు, పరిధిని మాత్రమే ఆయన విస్తరించాడని కొందరు చరిత్రకారులు వాదిస్తున్నారు.

**శమంతక మణి :** సోమనాథ్ ఆలయంలోని 'శమంతక మణి' అనే అద్భుత రత్నం ఉందని చెబుతారు. దాన్ని తాకిన ప్రతిదీ బంగారంగా మారిపోతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ శమంతక మణిని జ్యోతిర్లింగం బోలు లోపల దాచారని తెలుస్తోంది.

**జానపద కథ :** సోమనాథ్ ఆలయానికి సంబంధించి ఓ జానపద కథ ప్రచారంలో ఉంది. ఇక్కడ కొలువైన శివుడిని 'సోమనాథ్' అని పిలుస్తారు. అంటే 'చంద్రుని ప్రభువు' అని అర్థం. పురాణాల ప్రకారం, చంద్రుడు దక్ష ప్రజాపతికి అల్లుడు. అతని 27 మంది కుమార్తెలను చంద్రుడు పెళ్లి చేసుకున్నాడు. అయితే చంద్రుడు తన భార్యలందరినీ వదిలేస్తాడు. దీంతో ఈ ప్రవర్తన దక్షకు చిరాకు తెప్పించి, చంద్రుడిని శపించాడు. ఫలితంగా చంద్రుడు తక్కువ ప్రకాశంగా మారాడు.దక్ష శాపంతో చంద్రుడు విచారం వ్యక్తంచేస్తూ సహాయం కోసం బ్రహ్మదేవుడిని ప్రార్థించాడు. అయితే శివున్ని పూజించమని బ్రహ్మదేవుడు సలహా ఇచ్చాడు. సోమనాథ్ ఆలయం ఉన్న ప్రస్తుత ప్రదేశంలో కూర్చొని చంద్రుడు కఠోర తపస్సు చేశాడు. చివరికి, శివుడు అతని భక్తికి మెచ్చి వరం కోరుకోమన్నాడు. దక్ష శాపం నుంచి తనను విముక్తి చేయాలని కోరి, తన ప్రకాశాన్ని తిరిగి పొందాడు. ఇందుకు కృతజ్ఞతాభావంతో చంద్రుడు శివునికి బంగారు ఆలయాన్ని నిర్మించాడు. తదనంతరం, ఈ ఆలయాన్ని రావణుడు వెండితో, శ్రీకృష్ణుడు చెక్కతో, పాండవుల్లో ఒకరైన భీముడు రాతితో నిర్మించారని జానపదకథ ప్రచారంలో ఉంది.

**ప్రసిద్ధ తీర్థయాత్ర :** ఆలయం శిఖరంపై 37 అడుగుల పొడవైన జెండా ఉంటుంది. ఆలయ సిబ్బంది ఈ జెండాను రోజుకు మూడు సార్లు మారుస్తారు. పురాణాల ప్రకారం.. సరస్వతి, కపిల, హిరాన్ అనే మూడు నదుల పవిత్ర సంగమంగా, ఆలయ నిర్మాణానికి ముందు సోమనాథ్ ప్రదేశం ఒక ప్రసిద్ధ తీర్థయాత్రగా గుర్తింపు పొందింది.

# ఆ రాష్ట్రంలో 800 మందికి పైగా విద్యార్థులకు హెచ్ఐవీ పాజిటివ్.. 47 మంది మృతి

అక్వైర్డ్ ఇమ్యునో డిఫిషియెన్సీ సిండ్రోమ్ అంటే ఎయిడ్స్ ప్రపంచమంతటా వేగంగా విస్తరిస్తోంది. ఇదిలా ఉంటే దేశంలోని త్రిపుర రాష్ట్రం నుంచి ఓ పెద్ద వార్త బయటకు వచ్చింది.త్రిపురలో హెచ్ఐవీ కారణంగా 47 మంది విద్యార్థులు మరణించారని త్రిపుర స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీఎస్ఏసీఎస్) సీనియర్ అధికారి తెలిపారు. 828 మంది విద్యార్థులు హెచ్ఐవి పాజిటివ్‌గా గుర్తించారు. వీరిలో 572 మంది విద్యార్థులు బతికే ఉన్నారు. దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఉన్నత విద్య కోసం చాలా మంది విద్యార్థులు త్రిపుర నుంచి వెళ్లిపోయారు.త్రిపుర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ 220 పాఠశాలలు, 24 కళాశాలలు, కొన్ని విశ్వవిద్యాలయాల నుండి ఇంజక్షన్ ద్వారా డ్రగ్స్ సేవించే విద్యార్థులను గుర్తించింది. ఇన్ఫెక్షన్ కేసులు పెరగడానికి ఇదే ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

# ఇకపై హైదరాబాద్ టూ తిరుపతి ప్రయాణం.. రయ్.. రయ్‌మని దూసుకెళ్లిపోవచ్చు



అమరావతి :తెలంగాణలో రహదారుల విస్తరణ, కొత్త రహదారుల నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ అంశంపై అధికారులకు కీలక సూచనలు చేయడంతో పాటు..సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు సీఎం రేవంత్. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఉన్నతాధికారులు.. సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలకవ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో నేషనల్ హైవేల నిర్మాణానికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. రహదారుల నిర్మాణానికి ఏవైనా ఆటంకాలు ఉంటే వాటిని వెంటనే తొలగిస్తామన్నారు.రాష్ట్రంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చేపడుతున్న రహదారుల నిర్మాణంలో భూ సేకరణతో పాటు పలు ఇబ్బందులు ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం.. ఆయా సమస్యల పరిష్కారానికి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. రహదారుల నిర్మాణం జరిగే జిల్లాల కలెక్టర్లు, అటవీశాఖ అధికారులు ఈ భేటీలో పాల్గొంటారని, ఆయా సమస్యలపై చర్చించి అక్కడే సమస్యలను పరిష్కరించుకుందామని సీఎం సూచించారు. ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్ మధ్యలో 12 రేడియల్ రోడ్లు వస్తాయి. వాటి మధ్య పలు క్లస్టర్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణకు తీర ప్రాంతం లేనందున బందర్ పోర్టును అనుసంధానించేలా హై స్పీడ్ ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఇక హైదరాబాద్ -కల్వకుర్తి జాతీయ రహదారి నిర్మిస్తే తిరుపతికి 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. మన్నెగూడ రహదారి పనులనూ వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఏఐ అధికారులకు సూచించారు.కాంట్రాక్ట్ సంస్థతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు వెంటనే మొదలు పెట్టాలని వారికి సూచించారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. హైదరాబాద్-విజయవాడ మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు కోసం ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలను అధికారుల దృష్టికి సీఎం తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి సహకరించాలని అధికారులను సీఎం కోరారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. 18 మంది మృతి.. 30 మందికి గాయాలు

న్యూఢిల్లీ : దేశంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వాహనాలు అజాగ్రత్తగా నడపడం, మద్యం తాగి నడపడం, ఓవర్‌టెక్ చేయడం వల్ల ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రభుత్వాలు, పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా ఏ మాత్రం ఆగడం లేదు. ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. తాజాగా బుధవారం ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ట్రావెల్స్ బస్సును కంటైనర్ ఢీకొనడంతో 18 మంది మృతి చెందారు.అలాగే 30 మంది వరకు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటన లక్నో-ఆగ్ర ఎక్స్‌ప్రెస్ హైవేపై చోటు చేసుకుంది. ఈ ప్రమాదంపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

# ఉత్తరాదిలో జలప్రళయం.. మళ్లీ ఐఎండీ రెడ్ అలర్ట్.. ఆ ప్రాంతాల్లో భారీ వర్షాలు



న్యూఢిల్లీ : ఉత్తరాదిలో జలప్రళయం.. అసోం, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, ముంబై,ఉత్తరాఖండ్‌లోనూ వరుణుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ప్రస్తుతం దేశం మొత్తం రుతుపవనాలు చాలా చురుగ్గా ఉన్నాయి.దేశంలో పలుచోట్ల వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఇప్పటికే పలు రాష్ట్రాలు వరదలతో నిండి ఉన్నాయి. నదులు ప్రమాదస్థాయి దాటి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల కొండ చరియలు విరిగిపడుతున్నాయి. అసోంలో ఇప్పటికీ లక్షల మంది ప్రజలు వరదల బారిన పడ్డారు. అసోంలోని 27 జిల్లాలు వరదలతో ప్రభావితమయ్యాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అనేక గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంది. వర్షాలకు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. 91 రెవెన్యూ, 3వేల 154 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అస్సాంలో వరదల కారణంగా మరణిస్తున్న వారి సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుతోంది. బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని సీఎం హిమంత బిస్వా శర్మ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇప్పటికీ 48వేల మంది షెల్టర్లలో ఉన్నారు. వరదలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో.. తాజాగా ఏడుగురు మరణించారు.. ఇప్పటివరకు 92 మంది మరణించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఉత్తరాఖండ్‌లో వర్షం బీభత్సం..**

ఇక ఉత్తరాఖండ్‌లో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. 72 గంటల పాటు ఏకధాటిగా వర్షం కురుస్తోంది. నదులు ప్రమాదస్థాయి దాటి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల కొండ చరియలు విరిగిపడుతున్నాయి. కీలక హైవేలపై రాకపోకలు నిలిపివేశారు. పలు రైల్వే స్టేషన్లు మునిగిపోయిన పరిస్థితి కనిపిస్తోంది. వర్షం కారణంగా పలు రైళు రద్దు చేశారు. పలు పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులు ఇరుక్కుపోయారు.

**ఉత్తరప్రదేశ్.. హిమాచల్ ప్రదేశ్‌లో**

ఉత్తరప్రదేశ్‌లోనూ ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజలందరూ కూడా అల్లాడిపోతున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. హైవేలు సహా 70 రోడ్లు మూసివేశారు. బీహార్‌లోని కోసి నది నీటిమట్టం పెరగడంతో వరద ముప్పు పొంచి ఉంది. బీహార్‌లోని నదుల నీటిమట్టం పెరగడంతో 7 జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముంబై తీరంలో హై టైడ్ అలర్ట్ జారీ చేశారు. అటు విద్యాసంస్థలు కూడా ఇవాళ బంద్ చేశారు. అంతేకాకుండా కొన్ని చోట్ల లోకల్ ట్రెయిన్స్ కూడా బంద్ అయ్యాయి.కాగా.. ఈ నెల 12 వరకూ హిమాచల్‌ప్రదేశ్, బెంగాల్, బీహార్, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణశాఖ హెచ్చరించింది.

# నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరు అరెస్ట్.. ఇప్పటివరకు ఎందరు అరెస్టయ్యారంటే!




న్యూఢిల్లీ,: నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో విచారణ కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది.అరెస్టవారిలో ఒకరు నీట్ అభ్యర్థి కాగా, మరొకరు మరో నీట్ అభ్యర్థి తండ్రిగా సీబీఐ వెల్లడించింది. వీరిద్దరూ బీహార్‌కు చెందినవారిగా దర్యాప్తు సంస్థ తెలిపింది. నీట్-యూజీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో నీట్ అభ్యర్థిని సీబీఐ నేరుగా అరెస్టు చేయడం ఇదే తొలిసారి. తాజాగా అరెస్ట్ అయిన ఇద్దరిలో ఒకరు నలందకు చెందిన నీట్-యూజీ అభ్యర్థి సన్నీ, మరొకరు గయాకు చెందిన మరో అభ్యర్థి తండ్రి రంజిత్ కుమార్‌గా సీబీఐ అధికారులు వెల్లడించారు. దీంతో ఈ కేసులో అరెస్టైన వారి సంఖ్య 11కు చేరిందని అధికారులు మంగళవారం (జులై 9) తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు బీహార్ నీట్-యుజి పేపర్ లీక్ కేసులో ఇప్పటివరకు 8 మందిని, గుజరాత్‌లోని లాతూర్, గోద్రాలో ఇద్దరిని, డెహ్రాడూన్‌కు చెందిన ఒకరిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు.కాగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో %వీదీదూ, దీణూ%, ఆయుష్, ఇతర సంబంధిత కోర్సులలో ప్రవేశాలకు నీట్ యూజీ 2024 పరీక్షనుఈ ఏడాది మే 5న విదేశాల్లో 14 సహా 571 నగరాల్లోని 4,750 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షకు 23 లక్షల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. అయితే పేపర్ లీక్‌తోపాటు గ్రేస్ మార్కులు కలపడంపై దుమారం రేగింది. పైగా 67 మందికి ఫస్ట్ ర్యాంకు రావడంపైనా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి.ఈ క్రమంలోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రేస్ మార్కులు కలిపిన 1563 మందికి మళ్లీ పరీక్ష నిర్వహించి కొత్త ర్యాంకు కార్డులు జారీ చేసింది. మరోవైపు నీట్ పరీక్షలో చోటు చేసుకున్న అవకతవకలు, అక్రమాల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో

# Arrested BJP Leader's Big 100 Cr Bribe Charge Against DK Shivakumar in Sex Tapes Case



In a twist to the Prajwal Revanna sex scandal case, arrested BJP leader G Devaraje Gowda on Friday alleged that Karnataka Deputy Chief Minister DK Shivakumar offered him Rs 100 crore to implicate former Chief Minister and JD-S state President HD Kumaraswamy for circulating the explicit videos.He said that it was Shivakumar who planned the entire scheme and obtained a pen drive, carrying explicit videos involving Revanna from his driver, in an alleged attempt to implicate Kumaraswamy and PM Modi falsely."I was told to make a statement that it was Kumaraswamy who circulated the pen drives containing sex videos. But it was Shivakumar who obtained the pen drive from Karthik Gowda, who worked as a driver for Prajwal Revanna, and planned the entire episode," Gowda said.The arrested leader further alleged that the Congress leaders also planned to malign the image of Prime Minister Narendra Modi by linking him to the infamous sex scandal case."They had planned in a big way to bring disrepute to Prime Minister Modi, Kumaraswamy, and the BJP. They offered me Rs 100 crore and sent Rs 5 crore as advance to Room No. 110 at Bowring Club. A local leader from Channarayapatna, Gopalaswamy, was sent to negotiate the deal," Devaraje Gowda claimed.Gowda further claimed that the Deputy CM even sent him Rs 5 crore in advance to make such statements and it was his refusal to do so that landed him in jail in a false case adding that he would expose Shivakumar as soon as he is out of the prison."I have the audio recordings of Shivakumar's conversations. I will release them as soon as I am released," he said.The leader said a team of four Congress ministers, including Cheluvarayaswamy, Krishna Byre Gowda, and Priyank Kharge, was formed to handle the developments relating to the sex video scandal."After I refused the offer, police cases were lodged against me and I was arrested. I am ready to expose him (Shivakumar) once I am released. The Congress government will to collapse in Karnataka," he said while speaking to the media from the police vehicle.On Friday, Gowda, Bharatiya Janata Party (BJP) leader and Advocate G Devaraje Gowda, who was arrested in another sexual harassment case, was sent to judicial custody.The controversy revolves around the pen drives containing explicit videos involving JD(S) MLA Prajwal Revanna, which surfaced just days before the second phase of polling on April 26.

# 'Not surprised at what Arvind Kejriwal said'



